

తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ శ్రేణులకు చంద్రబాబు అభివాదం - తిరుమలలో టీడీపీ కార్యకర్తలను పలకరిస్తున్న లోకేశ్ - గాయత్రి నిలయం అతిథి గృహానికి వెళుతున్న నారా బ్రాహ్మణి, భువనేశ్వరి







జిల్లా అంతటా ప్రమాణోత్సవ సందడి

● నాగయ్య కళాక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారం ● కిక్కిరిసిన సభాప్రాంగణం



చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని నాగయ్య కళాక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకిస్తున్న అధికారులు, స్థానికులు





చిత్తూరులోని గాంధీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్ర్కీన్‌లో ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం జిల్లా అంతటా పండుగ వాతావరణం నెలకొంది. చంద్రబాబుతో పాటు మంత్రులూ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలందరూ వీక్షించేలా అధికారులు ఎల్ఈడీ స్ర్కీన్లు అమర్చారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో తొలి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండు భారీ ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్యతో పాటు డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా అధికారులందరూ హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి వి.సురేంద్ర కుమార్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మాజీ ఇన్‌చార్జి మేయర్ ఆర్.సుబ్రహ్మణ్యం, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకల్లా సభాప్రాంగణం మహిళలతో నిండిపోయింది. ఆలస్యంగా వచ్చిన వాళ్లు నిలబడే ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించారు. పలువురు అధికారులకు కుర్చీలు తెప్పించి వేయాల్సి వచ్చింది. చంద్రబాబు పవన్ కల్యాణ్ ప్రమాణం సందర్భంగా మహిళలతో పాటు యువతీ యువకుల కేరింతలు, ఈలలతో సభాప్రాంగణం దద్దరిల్లింది. నాగయ్య కళాక్షేత్రాన్ని పసుపు రంగు బెలూన్లు, పుష్పాలతో అలంకరించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను పేర్కొంటూ స్వయం సహాయకసంఘాల మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ఈడీ స్ర్కీన్ల ద్వారా ప్రజలు తిలకించారు. పలుచోట్ల ర్యాలీలు, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

పుంగనూరులో పసుపు జెండాల రెపరెప

పుంగనూరు: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం పుంగనూరులో పసుపు జెండాలు రెపరెపలాడాయి. ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఐదేళ్ల తర్వాత ఎక్కడ చూసినా చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ ఫ్లెక్సీలు వెలిశాయి. ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ప్రజలు వీక్షించేలా ఎన్టీఆర్ సర్కిల్‌లో పెద్ద ఎల్ఈడీ స్ర్కీన్‌ను టీడీపీ శ్రేణులు... ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఏర్పాటు చేశారు. తూర్పుమొగసాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు పార్టీ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చుతూ, రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. పలుచోట్ల కేకులు కట్ చేశారు. అన్నదానం చేశారు.



పుంగనూరులో ఎన్డీయే కూటమి సంబరాలు

ఐదేళ్ల నిరీక్షణ తర్వాత టీడీపీ అధికారంలోకి రావడం ఆ పార్టీ శ్రేణులను ఆనందపరిచింది. చంద్రబాబు సీఎంగా కొత్త ప్రభుత్వమూ బుధవారం కొలువుదీరింది. కానీ, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంత్రి వర్గంలో స్థానం దక్కకపోవడం శ్రేణులను నిరుత్సాహానికి గురిచేసింది. ముఖ్యమంత్రి మన జిల్లావాసేనని సంతృప్తి పడినా.. మంత్రి పదవి విషయంలో ఏం జరిగిందనేది నేతలు, శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి కారణాలు గానీ, సమీకరణలు గానీ పార్టీ నుంచి బయటకు పొక్కడం లేదు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఏం జరిగింది?

- ఉమ్మడి జిల్లాకు దక్కని మంత్రి పదవి
- ముఖ్యనేతలకూ అంతుబట్టని సమీకరణలు
- అందరి దృష్టీ ఖాళీగా ఉన్న ఒక బెర్త్‌పైనే
- స్పీకరు, డిప్యూటీ, చీఫ్ విప్, నాలుగు విప్ స్థానాలపై ఆశలు

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పలమనేరు ఎమ్మెల్యే నూతనకాల్వ అమరనాథరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిలకు మంత్రి పదవులు లభిస్తాయని పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాలు, జిల్లా ప్రజానీకం అంచనా వేశాయి. ప్రాంతీయ, సామాజిక సమీకరణాల రీత్యా ఇద్దరికీ సాధ్యపడకపోతే ఎవరో ఒకరికి తప్పక అవకాశం వస్తుందని బలంగా నమ్మారు. అయితే బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా, 24 మంది మంత్రులుగా రాష్ట్ర మంత్రివర్గం కొలువుదీరింది. ఈ మంత్రివర్గంలో 13 ఉమ్మడి జిల్లాలలో ఒక్క చిత్తూరు జిల్లాకు మాత్రమే ప్రాతినిధ్యం లేకుండా పోవడం టీడీపీ వర్గాలను తీవ్ర నిస్పృహకు గురిచేశాయి. కాగా, పలమనేరు, పీలేరు నియోజకవర్గాల నుంచీ భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లాయి. తమ తమ నేతలు ప్రమాణ స్వీకారం చేసే దృశ్యాలను స్వయంగా చూడాలని సంబరపడ్డారు. అయితే వీరి పేర్లు లేకపోవడంతో నిరుత్సాహంతో వెనుదిరిగారు. మరోవైపు జిల్లా నుంచి ఎస్సీ కోటాలో గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ పేరూ ప్రచారంలో ఉండింది.

కారణాలేమై ఉంటాయి?

ఉమ్మడి జిల్లా నుంచి సీఎంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తుండగా మళ్లీ మంత్రులు ఎందుకన్న ఉద్దేశంతో మంత్రి పదవి దక్కకపోయి ఉండొచ్చన్న వాదన వినిపిస్తోంది. అలాగే సామాజికవర్గాల సమతుల్యతలో భాగంగా అమర్, నల్లారి కంటే సీనియర్లు, ముఖ్యమైన ఎమ్మెల్యేలకు ఇతర జిల్లాల్లో అవకాశం ఇచ్చినందున వీరికి అవకాశం తప్పిపోయిందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో ఇద్దరికీ ఇచ్చే పరిస్థితి లేదని, అలాగని ఒకరికి ఇస్తే. మరొకరు మనస్తాపానికి గురయ్యే పరిస్థితుల్లో ఇద్దరికీ ఇవ్వలేదన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇవేవీ పార్టీ నుంచీ అధికారికంగా వచ్చిన సమాచారాలు కావు. కేవలం పార్టీ వర్గాల అంచనాలు మాత్రమే.

ఆశలు రేకెత్తిస్తున్న ఖాళీ పదవులు

మంత్రివర్గంలో ముఖ్యమంత్రి కాకుండా 25 మంది మంత్రులు ఉండొచ్చు. ఇప్పుడు ప్రమాణ స్వీకారం చేసింది 24 మంది మంత్రులే. ఈ ఖాళీగా ఉన్న మంత్రి పదవిని వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో జిల్లాకు దక్కుతుందన్న ఆశ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇక, అసెంబ్లీ స్పీకరు, డిప్యూటీ స్పీకరు, చీఫ్ విప్, నాలుగు విప్ పదవులు ఉన్నాయి. వీటిలో డిప్యూటీ స్పీకరు, చీఫ్ విప్, విప్ పదవులు సైతం క్యాబినెట్ హోదా కలిగినవే. వీటిలో అమర్, కిషోర్‌లలో కనీసం ఒకరికి కీలక పదవి, మిగిలిన ఎమ్మెల్యేలలో ఒకరిద్దరికి ఇతర పదవుల్లో ఏవో ఒకటి లభిస్తాయన్న ఆశాభావం టీడీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇంకా పదవులు, వాటిని భర్తీ చేసేందుకు సమయం ఉన్నందున అంతవరకూ వేచి చూసే ధోరణితో పార్టీ వర్గాలు సరిపెట్టుకుంటున్నాయి.

వైసీపీలో ముగ్గురు మంత్రులున్నా చేసిందేమిటి?

ఒకవేళ జిల్లాకు మంత్రి పదవి లేకున్నా.. అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తారని టీడీపీ వర్గాలు అంటున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి మంత్రులుగా పనిచేశారు. ఆ తర్వాత విస్తరణలో రోజాకూ మంత్రివర్గంలో చోటు కల్పించారు. ఈ ముగ్గురూ జిల్లా అభివృద్ధిలో ఎలాంటి ముద్ర వేయలేకపోయారని టీడీపీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఒక్క పెద్దిరెడ్డి మాత్రమే అధికారుల్ని గ్రిప్‌లో పెట్టుకుని ప్రత్యర్థులపైన కక్ష సాధింపు చర్యలకు వాడుకున్నారే తప్ప జిల్లా అభివృద్ధికి వీరు చేసిందేమీ లేదని వారు గుర్తుచేస్తున్నారు.

బడిగంట మోగే వేళ..!

● తొలి రోజే పాఠ్యపుస్తకాల అందజేత ● కొత్త ప్రభుత్వంపై ఆశలు.. తల్లికి వందనం ● నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



జిల్లాకు చేరిన పుస్తకాలు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 12: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి బడి గంట మోగనుంది. 40 రోజులపాటు సరదాగా గడిపిన పిల్లలు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. జిల్లాలోని 2900 అన్ని యాజమాన్య పాఠశాలల్లో 2,39,629 మంది చదువుతున్నారు. ప్రభుత్వం యాజమాన్య పరిధిలోని 2483 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1,67,941 మంది విద్యార్థులు ఉండగా, 417 ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు 71,688 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా, పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఒకటి నుంచి టెన్త్ వరకు చదివే 1,67,941 మంది విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందనున్నాయి. ఒకటి నుంచి 7వ తరగతి వరకు అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరాయి. 8 నుంచి టెన్త్ వరకు ఒకటి, రెండు సబ్జెక్టులు మినహా అన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటితో పాటు జిల్లాకు చేరిన నోట్ పుస్తకాలు, బెల్ట్‌లను ఎంఈవో కార్యాలయాలకు చేర్చారు. షూలు మాత్రం నాలుగు మండలాలకే వచ్చాయి. బ్యాగులు రావాల్సి ఉంది. కాగా, స్టూడెంట్ కిట్లను పాఠశాల స్థాయి వరకు చేర్చడానికి అవసరమైన రవాణా ఖర్చుల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో హెచ్ఎంలపై ఎలాంటి అదనపు భారం ఉండదు.



కొత్త ప్రభుత్వంలో తల్లికి వందనం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట ఒక ఇంట్లో ఎంత మంది బిడ్డలు బడికి వెళతారో వారదరికీ రూ.15 వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది. దీంతో జిల్లాలోని 2.39 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. వైసీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పేరిట రూ.15 వేలు జమ చేస్తామని 2019లో పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇద్దరు పిల్లలని చెప్పి ఒకరికే వర్తింపచేసింది. మధ్యలో ఒక విద్యాసంవత్సరాన్ని తప్పించింది. షరతులు, కోతలతో లబ్ధిదారులనూ తగ్గించేసింది. మరుగుదొడ్లు, పాఠశాలల నిర్వహణ పేరుతో రూ.2వేలు కోత విధించి రూ.13 వేలు మాత్రమే జమ చేసింది.


తొలి రోజే పాఠ్యపుస్తకాలు ఇస్తాం

కొత్త విద్యాసంవత్సరానికి గాను అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజునే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తాం. ఇప్పటికే వీటిని మండల కేంద్రాలకు చేర్చాం. అక్కడి నుంచి పాఠశాలలకు చేర్చేందుకు అవసరమయ్యే రవాణా ఖర్చులకు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.




- వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష

మళ్లీ మండుతున్న ఎండలు



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 12: నైరుతి రుతుపవనాలు స్తబ్దుగా మారడంతో జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత శనివారం వరకు రుతుపవనాల విస్తరణతో జిల్లా అంతటా జూన్ నెల సాధారణ వర్షపాతం కంటే మించి వర్షాలు కురిశాయి. ఆదివారం నుంచి వర్షాలు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తేమశాతం తగ్గి, అన్ని ప్రాంతాల్లో ఉక్కపోత పెరిగింది. ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. మధ్యాహ్నం వేళ ఎండ కారణంగా రోడ్లపై సంచరించడానికి జనం భయపడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నా 40 డిగ్రీలలాగా అనిపిస్తోంది. రానున్న వారం రోజులు ఇదే విధంగా ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంది.



టమోటా కిలో రూ. 52

పలమనేరు, జూన్12 : పలమనేరు మార్కెట్‌యార్డులో బుధవారం టమోటాలు కిలో రూ. 52 పలికాయి. మంగళవారం కిలో టమోటాలు రూ. 56 పలుకగా బుధవారం కిలోకు రూ. 4 తగ్గి రూ. 52 పలికాయి. మరో మూడు నెలలపాటు టమోటా ధరలు ఇలాగే కొనసాగవచ్చని భావిస్తున్నారు.



సోమల పట్టణ నడివీధిలో ప్రతిష్ఠించిన గంగమ్మ



రాత్రి జాగరణతో దీలు తీసుకెళుతున్న మహిళలు

సోమలలో వైభవంగా గంగ జాతర

సోమల, జూన్ 12: గంగజాతర సందర్భంగా బుధవారం సోమల పట్టణం జనసంద్రంగా మారింది. శివాలయం వద్ద అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి 10 గంటలకు అమ్మవారి ప్రతిమను రామాలయం నుంచి రజక రమణ ఇంటి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు జరిపారు. మంగళవారం రాత్రి 12 నుంచి బుధవారం ఉదయం 4 గంటల వరకు బోయకొండమ్మ, మారెమ్మ, విరూపాక్షం, పోలేరమ్మ ఆలయాల వద్దకు మహిళలు దీలు, బోనాల తీసుకెళ్లి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఉదయం బలిపోతును ఊరేగించి అమ్మవారికి బలిదానంచేశారు. బలిహరణాన్ని పంటలపై చల్లి సుభిక్షంగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం మలిశెట్టిగారి కుటుంబసభ్యులు నగిరి దీలను, చిన్నయ్యగారి కుటుంబసభ్యులు మసెమ్మ భారీ దీలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. నడివీధి గంగమ్మ వద్దకు మహిళలు బోనాలు తీసుకుని వచ్చి పొంగళ్ల నైవేద్యంగా సమర్పించుకున్నారు. అలాగే అడుసుపల్లె, దాసరివారిపల్లె, గన్నావారిపల్లె, దిడ్డివారిపల్లె, మఠంగొల్లపల్లె, ముంద్రివారిపల్లె, చిన్నసోమల, దళితవాడ, సూరయ్యగారిపల్లె, పొదలగుంట్లపల్లె, నడింపల్లెల్లో జాతర వేడుకలు జరుపుకొన్నారు.

ఏనుగుల దాడుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

సీసీఎఫ్‌వో నాగేశ్వరరావు

కుప్పం, జూన్ 12: గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల దాడులపట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ ఉండాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు అటవీ శాఖ అధికారులకు సూచించారు. మంగళ, బుధవారాలలో ఆయన కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. రామకుప్పం మండలం ననియాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడున్న కుకీ ఏనుగులు గణేశ్, జయంత్‌లను చూసి వాటి సంరక్షణ సరిగా చేయాలని సూచించారు. అలాగే కుప్పం మండలం బేటరాయస్వామి కొండ ప్రాంతంలో వనాభివృద్ధి పనులను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్‌వో మాట్లాడుతూ ఏనుగుల దాడుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించారు. కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్, డీఆర్వోలు వైసీ. రెడ్డి, కృష్ణ ప్రసాద్ ఇతర అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుకీ ఏనుగుల సంరక్షణ గురించి సిబ్బందికి వివరిస్తున్న సీసీఎఫ్‌వో

ఈఏపీ సెట్‌లో ఐఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, జూన్ 12: మంగళవారం విడుదలైన ఈఏపీ సెట్ పరీక్షా ఫలితాలలో కుప్పంలోని ఐఆర్ఎం కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి మంచి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. కేఎస్.జీవన రాష్ట్ర స్థాయిలో 643 ర్యాంకు సాధించినట్లు చెప్పారు. అలాగే ఆర్.లుబ్నాఖనమ్ 4776వ ర్యాంకు సాధించిందన్నారు. వీఐటీలో డి.జీవని అనే విద్యార్థి 2629వ ర్యాంకు, ఉమర్‌ఖాన్ 23333 ర్యాంకు, విష్ణుప్రియ 24735వ ర్యాంకు, కె.కస్తూరి 23617వ ర్యాంకు, కేహెచ్.నునిత్ కుమార్ 25182వ ర్యాంకులు సాధించి కళాశాల పేరు నిలబెట్టినట్లు పేర్కొన్నారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

కొత్తయిండ్లులో కొనసాగుతున్న వైద్యశిబిరం



బైరెడ్డిపల్లె,జూన్12: మండలంలోని కొత్తయిండ్లు గ్రామంలో అతిసార ప్రబలి ఆరుగురు అస్వస్థతకు గురికావడంతో రెండురోజులుగా తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు అరుణ్‌కుమార్, పద్మావతి అధ్వర్యంలో వైద్యశిబిరం కొనసాగుతోంది. బుధవారం కూడా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అవసరమైన వారికి మందులు పంపిణీచేశారు. ప్రస్తుతం బాధితులు కోలుకుంటున్నారని వైద్యసిబ్బంది తెలిపారు.

వైసీపీ నాయకులపై దాడి చేశారని ఫిర్యాదు

పుంగనూరు, జూన్12: పుంగనూరులో వైసీపీ కౌన్సిలర్, వైసీపీ నాయకునిపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఇందిరాసర్కిల్‌లో మున్సిపల్ కౌన్సిలర్ నటరాజపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎన్నికల సమయంలో టీడీపీ వారిని ఇబ్బంది పెట్టి ఇళ్లపై దాడులు చేసి దుర్భాషలాడారని దాడి పాల్పడ్డారు. అలాగే ఎంబీటీలో రోడ్డులో సప్లయిర్స్ దుకాణ నిర్వాహకుడు ఎండీ గౌస్, (కౌన్సిలర్ సాజిదా భర్త) దుకాణంపై దాడి చేయడంతో వైసీపీ నేతలు ఇద్దరు పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పశువుల సంతలో రైతులకు అన్నదానం



పుంగనూరు రూరల్, జూన్12: పుంగనూరు పశువుల సంతలో ఉన్న వ్యాపారస్తులు, రైతులకు బుధవారం టీడీపీ రాజంపేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మంరాజు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకపాలన నేటితో అంతమైందని, రైతుల పాలన వచ్చినట్లు తెలియజేయడానికే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జ్యోతిరాజు తదితరులు పాల్గొన్నారు.

నాపై దాడి చేశారు

- మాజీ ఎంపీటీసీ ఆరోపణ

పుంగనూరు, జూన్12: సీఎంగా నారా చంద్రబాబునాయుడి ప్రమాణ స్వీకారం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్‌ఈడీలో తిలకిస్తుండగా తనపై తెలుగుదేశం వారు దాడి చేశారని ఆరడిగుంట మాజీ ఎంపీటీసీ కేశవరెడ్డి ఆరోపించారు. టీడీపీ ఎంపీటీసీగా గెలుపొందిన తాను టీడీపీకి వెన్నుపోటు పొడిచానంటూ తనపై దాడులు చేయడం సరికాదన్నారు. కాగా దాడికి పాల్పడిన టీడీపీ శ్రేణులు మాత్రం తెలుగుదేశంపార్టీ ఓటమికి పని చేసి ప్రస్తుతం పార్టీ అధికారంలోకి రాగానే మళ్లీ తాను టీడీపీ అని చెప్పడం ఏమిటని అంటున్నారు.

బీసీలకు పుట్టినిల్లు టీడీపీ

పుంగనూరు రూరల్, జూన్12: సీఎం చంద్రబాబునాయుడు తన మంత్రి వర్గంలో 8మంది బీసీలకు మంత్రులుగా అవకాశం కల్పించడం హర్షనీయమని రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి గాజుల రమణ పేర్కొన్నారు. బుధవారం అయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు సముచితస్థానం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇతర పార్టీలు ఓట్లు కోసం బీసీ కులాలను ఉపయోగించుకుంటుదన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కల్లూరు, జూన్ 12: పులిచెర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో విద్యార్థులకు అవసరమైన 16144 నోటు పుస్తకాలు, బెల్టులు 1806 వచ్చాయన్నారు. 26580 పాఠ్య పుస్తకాలు రావలసి ఉండగా 14896 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. యూనిఫాం, స్కూలు బ్యాగులు, షూలు, డిక్షనరీలు రావలసి ఉందన్నారు. వాహనాల ద్వారా అయా పాఠశాలలకు పుస్తకాలను తరలించామని తెలిపారు.

అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్

పలమనేరు, జూన్12 : పలమనేరు మున్సిపాలిటీ కాకాతోపు ఏరియాలో బుధవారం ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునాఫ్ ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులను, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నభోజనం, నాణ్యమైన విద్య గురించి వివరిస్తూ బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దొరస్వామిరాజు మృతి



దొరస్వామిరాజు (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, జూన్ 12: మండలంలోని బాలగంగనపల్లె, వింజం పంచాయతీల ఉమ్మడి మాజీ సర్పంచ్ నడింపల్లె దొరస్వామిరాజు(87) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 1970 నుంచి 1990 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు ఎన్.దేవరాజులు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆత్మ మండల ఛైర్మన్‌గా, బాలగంగనపల్లె సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు ఇతర దేశాల్లో ఉన్నందున శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముగిసిన గంగమ్మ జాతర

గుడిపాల, జూన్ 12: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర వసంతాలతో ముగిసింది. 190 రామాపురం, కొత్తపల్లి, దళవాయిపల్లి గ్రామాల్లో గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పుష్పపల్లకిలో ఊరేగించారు. గుడిపాల అరుంధతివాడలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కొత్తపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

గుడిపాల, జూన్ 12 : మండలంలోని కొత్తపల్లి గ్రామ దళితవాడలో బుధవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణపడి ఆసుపత్రి పాలైన ఘటన చోటుచేసుకుంది. గంగమ్మ జాతర ముగింపు సమయంలో దళితవాడకు చెందిన విజయ్, కిషోర్ వర్గీయుల మధ్య మాటల యుద్ధం పెరిగి ఘర్షణ దిగారు. దీంతో ఇరువర్గాలు పోలీసులు ఫిర్యాదు చేయడంతో, వెస్ట్ సీఐ రవిశంకర్, తాలూకా ఎస్ఐ మల్లికార్జున్ సంఘటన స్థలాన్ని చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. దళితవాడలో పోలీసు బందోబస్తు ఏరాటు చేయడంతో కాలనీవాసులు ఊపిరి పిలుచుకున్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారంపై టీడీపీ సంబరాలు







కుప్పంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు, కుప్పం, పలమనేరులలో చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు, టీడీపీ నాయకులు

కుప్పం, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవ ఘట్టాన్ని పురస్కరించుకుని ఆయన సొంత నియోజకవర్గమైన కుప్పంలో సంబరాలు మిన్నంటాయి. కుప్పం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బస్టాండు కూడలిలో పెద్ద డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని చూసేందుకు ప్రజలకు అవకాశం కల్పించారు. గ్రామాలనుంచి వివిధ పనుల నిమిత్తం కుప్పం వచ్చిన ప్రజలతోపాటు, కుప్పంవాసులు కూడా ఈ లెడ్ స్కీన్‌లో ప్రమాణ స్వీకారోత్సవ మహోత్సవాన్ని తిలకించి పులకించారు. అలాగే టీడీపీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు పంచుకుంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కుప్పంలోనే కాక పలు గ్రామాల్లో చంద్రబాబు, నారా లోకేశ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు.

పలమనేరు : నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పలమనేరులో తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున్న పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి ప్రమాణ స్వీకార కార్యక్రమాలను వీక్షించారు. పట్టణంలో పలుచోట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి సంబరాలు చేసుకొన్నారు.

కల్లూరు : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పులిచెర్ల మండలంలోని అన్ని పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో టీవీల ద్వారా ప్రమాణస్వీకారం వీక్షించేలా అధికారులు ఏర్పాటుచేశారు. కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో కేక్ కట్‌చేసి బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. గెలసంవారిపల్లెలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొక్కువారిపల్లిలో టీడీపీ జెండాను ఆవిష్కరించి కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

సోమల : చంద్రబాబు నాలుగోసారి ప్రమాణ స్వీకారం పురస్కరించుకుని బుధవారం సోమల మండలంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కందూరు బస్టాండ్‌లో భారీ కేక్ కట్ చేసి పంచారు. సోమల బస్టాండ్‌లో బాణసంచాపేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

సదుం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా సదుంలో సంబరాలు చేసుకున్నారు. భారీ ఎత్తున బాణాసంచా పేల్చిన నాయకులు, కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రొంపిచెర్ల : బండకిందపల్లెలో టీడీపీ జెండాను ఏర్పాటుచేసి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో టీవీలు ఏర్పాటు ప్రజలు వీక్షించారు.

గుడుపల్లె : గుడుపల్లె బస్టాండ్, రైల్వేస్టేషన్ కూడలిలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. టపాకాయలు పేల్చారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అన్నదానం చేశారు.



సదుంలో టీడీపీ శ్రేణుల సంబరాలు



రొంపిచెర్ల మండలం బండకిందపల్లెలో ...



గుడుపల్లె రైల్వేస్టేషన్ కూడలిలో అన్నదానం





కల్లూరు, కందూరులలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

పుంగనూరులో మిన్నంటిన 'కూటమి' సంబరాలు





పుంగనూరులో ర్యాలీ చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, పుంగనూరులో పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జూన్ 12: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం పుంగనూరలో సంబరాలు మిన్నంటాయి. మున్సిపల్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో ప్రమాణ స్వీకార వీక్షణకు ఎల్‌ఈడీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళాసంఘాలు, ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ప్రమాణాస్వీకారాన్ని తిలకించారు. స్థానిక తాటిమాకులపాళ్యం, సింగిరిగుంట, పాళ్యంపల్లె తదితర గ్రామాల్లో అన్నదానం చేశారు. స్థానిక తూర్పుమొగసాల నుంచి టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పార్టీ జెండాలతో ర్యాలీగా సీఎం చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి, పవన్‌కళ్యాణ్, లోకేశ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. బళ్లారి డ్రమ్ములు వాయిస్తూ భారీఎత్తున బాణాసంచా పేల్చుస్తూ, రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఎంబీటీ రోడ్డు, ఇందిరాసర్కిల్, ప్రైవేటుబస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ చేరుకున్నారు. యువత కేరింతలు కొడుతూ ఆనందంతో నృత్యాలు చేశారు.

చౌడేపల్లె : స్థానిక బస్టాండ్‌లో టీడీపీ నాయకులు టపాకాయలు పేల్చి, కేక్ కట్‌చేసి, అన్నదానం నిర్వహించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో మహిళలు, అధికారులు టీవీలో ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయడంతో బోయకొండలో ఉన్న టీడీపీ మహిళా కార్యకర్తలు అమ్మవారికి దీపాలు బోనాలు, చీర, సారెలతో మంగళ వాయిద్యాలుతో అమ్మవారికి సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని, జంతు బలులు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోయకొండ క్రాస్ వద్ద చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె మండలపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బంది చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్యక్షప్రసారాన్ని టీవీలో వీక్షించారు. మండలపరిషత్ కార్యాలయం, రెవిన్యూ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

రామకుప్పం : రామకుప్పంలోని ఆటో స్టాండ్ సర్కిల్‌లో టపాకాములు కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని రామకుప్పం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు, అధికారులు ఆసక్తిగా తిలకించారు. మండల సచివాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.





చౌడేపల్లె బస్టాండ్‌లో, రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో సంబరాలు జరుపుకొంటున్న టీడీపీ నాయకులు

మోహినీ అవతారంలో ఇంద్రవరదుడు

- కమనీయంగా కల్యాణోత్సవం
- హనుమంత వాహనంపై స్వామివారి విహారం



యాదమరి, జూన్12: ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పెళ్లి మండపంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారిని వధూవరులుగా అలంకరించి, వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. అంతకుముందు మూలస్థానంలో వెలసిన దేవదేవరులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, హనుమంత వాహనంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారి నాచ్చియార్ తిరుక్కోలంలో మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి ద్వార పాలకులు, రాక్షస, అశ్వాలను అలంకరించి, సిద్ధం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి పురువీధులలో ఊరేగిస్తారు.

ఘనంగా అర్జున తపస్సు

శ్రీరంగరాజపురం, జూన్ 12: స్థానిక ధర్మరాజస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను ఎక్కడం, ఆయన విసిరిన నిమ్మ కాయల కోసం భక్తులు ఎగబడడం ఆకట్టుకుంది. పలువురు మహిళలు సంతానం కలగాలని తపస్సు మాను వద్ద వరపడ్డారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, నారాయణస్వామి నాయుడు, రాజశేఖర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, కేశవులు నాయుడు, మాధవ నాయుడు, మోహన్ నాయుడు, సుదర్శన్ నాయుడు, బాలాజీ నాయుడు, అంజనేయు నాయుడు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంపు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), జూన్ 12: 35వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెకండ్ ట్రైనింగ్ క్యాంపు కమాండర్ మేజర్ లోకనాథం అధ్యక్షతన బుధవారం డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. చిత్తూరు, కడప, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 600 మంది క్యాడెట్లు క్యాంపులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో సైనికుల పాత్రను గుర్తు చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు దేశసేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, కార్తీక్, సరోజ, రాంప్రసాద్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో పయనిద్దాం

నగిరి, జూన్ 12: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి బాటలో పయనిద్దామని మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం అన్నారు. బుధవారం నగిరి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు పలు సమస్యలను ప్రస్తావించగా వాటిని పరిష్కరిస్తామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ మంజునాథగౌడ్ పాల్గొన్నారు.

సభా వేదిక వద్ద కోలాహలం







వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

టి.ఒడ్డూరులో ప్రత్యేక మెడికల్ క్యాంపు






పలమనేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టి.ఒడ్డూరు గ్రామస్థులు - టి.ఒడ్డూరలో ప్రత్యేక మెడికల్ క్యాంపు

పలమనేరు, జూన్12: పలమనేరు మండలం టి.ఒడ్డూరులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. టి.ఒడ్డూరులో మంగళ వారం దాదాపు 30 మంది కల్తీ ఆహారం కారణంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఒక ఇంటిలో జరిగిన శుభస్వీకరణ కార్యక్రమానికి హాజరైన వారు సోమవారం రాత్రి నుంచి వాంతులు విరేచనాలతో బాధప డుతూ చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. వీరిలో ముగ్గురు పిల్లల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున మెరుగైన చికిత్స కోసం కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు ఆసుపత్రిలో బుధవారం కూడా 13 మందికి వైద్యులు చికిత్సలు కొనసాగిస్తున్నారు. దీంతో టి.ఒడ్డూరు పాఠశాల ఆవరణలో కొలమాసనపల్లి వైద్యాధికారిణి అనూకి ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. వాంతులు విరేచనా లతో బాధపడుతున్న 9 మందికి వైద్యులు చికిత్సలు చేసి సెలైన్లు పెట్టించారు. తాగునీటి ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటు బుధవారం ప్రత్యేక ట్యాంకరు ద్వారా క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

కుమారుడికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అనీస్ గోయెల్ - కారులోనే ఇరుక్కుపోయిన జ్యోతి గోయెల్ మృతదేహం - లారీ ఢీకొన్న కారు ప్రమాద దృశ్యం

పాకాల, జూన్ 12: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం గాదంకి ఎన్‌ఎఆర్‌ఎల్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్త దుర్మరణం చెందారు. ఏడేళ్ల కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న కెఎ51ఎంపి 7454 నెంబరు గల కారు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయి లారీలో ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బెంగుళూరులో ఉంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జ్యోతి గోయెల్ (34), ఆయన భార్య అనీస్ గోయెల్ (30) అక్కడికక్కడికే మృతిచెందారు. వారి కుమారుడు సుశాల్ గోయెల్‌కు తీవ్రగాయాలయ్యాయి. బాలుడిని చికిత్సకోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృత దేహాలను శవపరీక్ష నిమిత్తం తరలించి, పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి(మంగళం), జూన్ 12: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతపల్లి అటవీ ప్రాంతంలో 107 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ చెప్పారు. ఆయన కథనం మేరకు... కడప సబ్ డివిజన్ ఆర్‌ఎస్‌ఐ నరేష్ టీం చింతపల్లి అటవీప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా సోమవారం రాత్రి భైరవస్వామి తిప్ప వద్ద ఆటో, మోటారుసైకిల్ కనిపించాయి. పోలీసులను గమనించిన వారు పారిపోగా ఇద్దరిని మాత్రం పట్టుకోగలిగారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన రాజేంద్రకుమార్(41), ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం గడికోటకు చెందిన వాసం వెంకటసుబ్బయ్య(43)లుగా వారిని గుర్తించారు. వారి నుంచి 107 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్టేషనుకు తీసుకువచ్చి బుధవారం ఎస్‌ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేశారు.





రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం రాత్రి సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టరు షన్మోహన్, జేసీ శ్రీనివాసులు



సీఎంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తవణంపల్లె మండలం దిగువమాఘంలో కేక్ కట్ చేస్తున్న అమరరాజా వ్యవస్థాపకుడు గల్లా రామచంద్రనాయుడు

సమాజ హితానికి రచనలు అవసరం

● కుప్పం రెడ్డెమ్మ సాహితి పురస్కారాల పంపిణీలో డాక్టర్ కె.రామలక్ష్మి

చిత్తూరు కల్చరల్, జూన్ 12: సమాజ.హితానికి పురాణ, ఇతిహాసాలతో పాటు సామాజిక, సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానిక రచనలు చాలా అవసరమని కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టరు కె.రామలక్ష్మి అభిప్రాయపడ్డారు. 2023వ సంవత్సరపు నవలలు, కథానికల పోటీల విజేతలకు బుధవారం చిత్తూరులోని రాజా మహల్ హోటల్‌లో కుప్పం రెడ్డెమ్మ సాహితి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు తొలిగి, అందరిలో చైతన్యం కలిగించేలా రచనలు సాగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన తల్లి కుప్పం రెడ్డెమ్మ పేరుతో 31 సంవత్సరాలుగా అవార్డులను పంపిణీ చేస్తూ డాక్టర్ రామలక్ష్మి రచయితలను ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. ఇక, కాశీపురం ప్రభాకర్ రెడ్డి రచించిన మేడం నవలను సి.ఎస్.చంద్రశేఖర్.. కె.ఎ.మునిశేఖర్‌పిళ్లై రచించిన పుత్రికా శత్రు నవలను ఎం.ఆర్.అరుణకుమారి.. రోహిణి పంజారి రచించిన నల్లసూరీడు కథానికల సంపుటిని డాక్టర్ రోజాప్రియ.. సుగుణారావు రచించిన సుగుణ కథాభిరామం కథానికలను డాక్టర్ వి.హరినాయుడు సమీక్షించారు. రచయిత, రచయిత్రులను నిర్వాహకులు రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి నగదు పురస్కారం, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రత్యేక ప్రోత్సాహకంగా కాకినాడకు చెందిన యువ వైద్యుడు మురళీకృష్ణ, హరికథా కళాకారిణి ఎం.లక్ష్మిని సత్కరించారు. కుప్పం రెడ్డెమ్మ సాహితి పురస్కారగ్రహీతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల బాలక్రిష్ణారెడ్డితో పటు పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

హెల్త్ చెకప్ కోసం వస్తూ..

అదుపు తప్పి కారు బోల్తా ● నాలుగు నెలల గర్భిణి మృతి ● ఇద్దరికి స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, జూన్ 12: నాలుగు నెలల గర్భిణి. ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆమె అసువులు బాశారు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన బుధవారం ఉదయం బంగారుపాళ్యం మండలం మొగిలిఘాట్ దొరచెరువు వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా గుజ్జనగుండ్లలోని బొజ్జరాయి వీధిలో నివాసముంటున్న ప్రకాష్ కుమార్, లక్ష్మి దంపతుల కుమార్తె ఎస్.రాగ్నిజైత్రకు, గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ప్రతాప్‌తో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. ప్రతాప్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇన్నాళ్లకు ఆమె గర్భవతి కావడం.. ప్రస్తుతం నాలుగో నెల కావడంతో వేలూరు సీఎంసీలో చెకప్ చేయించడానికి బెంగళూరు నుంచి కారులో బయలుదేరారు. మొగిలిఘాట్ దొరచెరువు వద్దకు రాగానే కారు అదుపుతప్పి ఐదు పల్టీలు కొట్టింది. వెనుకసీటులో ఉన్న రాగ్నిజైత్ర(32) అక్కడికక్కడే మృతిచెందగా, ముందు సీటులో ఉన్న ప్రతాప్, ఆమె తల్లి లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడినవారిని 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. ప్రతాప్, లక్ష్మి బోరున విలపిస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రాగ్నిజైత్ర మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి లక్ష్మి



అదుపుతప్పి బోల్తాపడి నుజ్జునుజ్జయిన కారు

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



ర్యాలీలో విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 12 : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని డీఈవో దేవరాజు కోరారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విద్యాశాఖ, సమగ్రశిక్ష, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బడిబయట పిల్లలను బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన గంగమ్మ జాతర



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న గుడిపాల అరుంధతివాడ వాసులు

గుడిపాల, జూన్ 12: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గంగమ్మ జాతర వసంతాలతో ముగిసింది. 190 రామాపురం, కొత్తపల్లి, దళవాయిపల్లి గ్రామాల్లో గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి, మంగళవాయిద్యాలు, బాణసంచా మోత మధ్య పుష్పపల్లకిలో ఊరేగించారు. గుడిపాల అరుంధతివాడలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు, టీడీపీ నాయకులు గోపి, చల్లా, బాబు, పుష్పరాజ్, కార్తీక్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దొరస్వామిరాజు మృతి



దొరస్వామిరాజు (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, జూన్ 12: మండలంలోని బాల గంగనపల్లె, వింజం పంచాయతీల ఉమ్మడి మాజీ సర్పంచ్ నడింపల్లె దొరస్వామిరాజు(87) మరణించారు. బాలగంగనపల్లెలోని ఆయన స్వగృహంలో బుధవారం ఉదయం 6 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. 1970 నుంచి 1990 వరకు బాలగంగనపల్లె, వింజం పంచాయతీల ఉమ్మడి సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు ఎన్.దేవరాజులు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆత్మ మండల చైర్మన్‌గా, బాల గంగనపల్లె సర్పంచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు ఇతర దేశాల్లో ఉన్నందున శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన థామస్ సంతాపం తెలియజేశారు.

కష్టపడితే విజయం వరిస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న తేజోమూర్తి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 12: కష్టపడి, నిబద్ధతతో పనిచేస్తే ఏ రంగంలోనైనా విజయం వరిస్తుందని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి పేర్కొన్నారు. బుధవారం విజయం విద్యా సంస్థల సమావేశ మందిరంలో రజతోత్సవం (25వ) ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయం విద్యాసంస్థలు 25 ఏళ్ల ముందు 10 మంది విద్యార్థులతో మొదలై ప్రస్తుతం ఆరువేల మందితో వెలుగొందుతోందన్నారు. చిత్తూరు సమీపంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందించడమేగాక ఉద్యోగ కల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)ని ప్రారంభిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విజయం ది స్కూల్ ప్రిన్సిపాల్ శైలజామూర్తి, ఉపాధ్యాయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రైనింగ్ క్యాంపు ప్రారంభం



క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 12: 35వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెకండ్ ట్రైనింగ్ క్యాంపు కమాండర్ మేజర్ లోకనాథం అధ్యక్షతన బుధవారం డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రారంభమైంది. చిత్తూరు, కడప, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన 600 మంది క్యాడెట్లు క్యాంపులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో సైనికుల పాత్రను గుర్తు చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులు దేశసేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, కార్తీక్, సరోజ, రాంప్రసాద్, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ పరీక్ష ఫలితాల్లో మంగళ్ విద్యార్థుల ప్రతిభ



మోహిత్ రెడ్డి - కార్తికేయ రెడ్డి - పణీంద్రకుమార్

పూతలపట్టు, జూన్ 12: మండలంలోని పేటమిట్ట మంగళ్ విద్యాలయ విద్యార్థులు అగ్రికల్చర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటారు. ఎం.మోహిత్ రెడ్డి 2575 ర్యాంకు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. కార్తికేయ రెడ్డి 3404, పణీంద్రకుమార్ 3985, హేమప్రియ 7171, ప్రీతి 7701, లహరి 7831, ఎ.వర్షిక 11173, ఇ.హరిబాబు రెడ్డి 14488వ ర్యాంకులు సాధించారు. అగ్రికల్చర్‌లో వి.లక్ష్మి 3667వ ర్యాంకుతో మొదటి స్థానం, ఎం.జస్మిత 9584వ ర్యాంకుతో రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు గల్లా రామచంద్రనాయుడు అభినందించారు.

ఘనంగా అర్జున తపస్సు



తపస్మాన్ ఎక్కుతున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం, జూన్ 12: స్థానిక ధర్మరాజస్వామి ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను ఎక్కడం, ఆయన విసిరిన నిమ్మ కాయల కోసం భక్తులు ఎగబడడం ఆకట్టుకుంది. పలువురు మహిళలు సంతానం కలగాలని తపస్సు మాను వద్ద వరపడ్డారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, నారాయణస్వామి నాయుడు, రాజశేఖర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, కేశవులు నాయుడు, మాధవ నాయుడు, మోహన్ నాయుడు, సుదర్శన్ నాయుడు, బాలాజీ నాయుడు, అంజనేయ నాయుడు పాల్గొన్నారు.

జాతరలో ఇరు వర్గాల ఘర్షణ



కొత్తపల్లి దళితవాడలో పోలీసు పికెట్

గుడిపాల : మండలంలోని కొత్తపల్లి గ్రామ దళితవాడ జాతర ముగింపులో బుధవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. పలువురు గాయాలపాలై ఆసుపత్రిలో చేరారు. గంగమ్మ జాతర ముగింపు సమయంలో దళితవాడకు చెందిన విజయ్, కిశోర్ వర్గీయుల మధ్య మాటల యుద్ధం పెరిగి ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెస్ట్ సీఐ రవిశంకర్, తాలూకా ఎస్సై మల్లికార్జున్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెట్ ఏర్పాటు చేశారు.

ముగిసిన గంగజాతర

చిత్తూరు కల్చరల్, జూన్ 12 : నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం గంగజాతర ముగిసింది. తేనెబండ ముత్యాలమ్మ, నడివీధి గంగమ్మ, ఇరువారం ఇందిరమ్మ కాలనీ, సాంబయ్య కండ్రిగ, గోపాలపురం తదితర ప్రాంతాల్లో గంగమ్మకు జలాభిషేకం నిర్వహించి, ముగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

చంద్రబాబును కలిసిన గాంధీ



వెదురుకుప్పం, జూన్ 12: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి, శ్రీవారి దర్శనార్థం బుధవారం రాత్రి తిరుపతికి వచ్చిన చంద్రబాబును విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఆర్. గాంధీ కలిశారు. పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతించారు.

వాణిజ్యపన్నుల శాఖలో అరాచకాలను అరికట్టాలి

చిత్తూరు రూరల్, జూన్ 12: జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అరాచకాలను అరికట్టాలని చిత్తూరు డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్ణం, కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి సంయుక్త ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారుల అరాచక విధానాల వల్ల శాఖ భ్రష్టుపట్టిందన్నారు. ప్రభుత్వ పెద్దలతో కుమ్మక్కై శాఖ పునర్వ్యవస్థీకరణ పేరుతో వందల కొద్దీ కిందిస్థాయి పోస్టులను రద్దు చేయడం ద్వారా ఉద్యోగులు, నిరుద్యోగులు మోసపోయారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి, న్యాయం చేయాలని కోరారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘర్షణ సమితి సభ్యులు

చిత్తూరు కల్చరల్, జూన్ 12: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు దళిత సంఘర్షణ సమితి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. దర్గా సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, చంద్రబాబు పాలనలో పేదలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. ధనశేఖర్, కదిరవేలు, మునిరత్నం పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో పయనిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం

నగిరి, జూన్ 12: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి బాటలో పయనిద్దామని మున్సిపల్ చైర్మన్ నీలమేఘం అన్నారు. బుధవారం నగరి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు పలు సమస్యలను ప్రస్తావించగా వాటిని పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ మంజునాథగౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలకు రాజకీయ గ్రహణం

కొన్నేళ్లుగా మూతపడిన వైనం



కార్వేటినగరం, జూన్ 12: ఎంఎం విలాసం గ్రామ పంచాయతీ మునిరెడ్డి కండ్రిగలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాజకీయ గొడవల కారణంగా మూతపడింది. విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు వైసీపీ, టీడీపీ గ్రూపులుగా విడిపోయారు. ఈ కారణంగా గ్రామంలో జాతర ఒక రోజు ఒక పార్టీ నాయకులు నిర్వహిస్తే మరో రోజు ఇంకో పార్టీ వారు జరుపుకుంటారు. ఇదే తరహాలో వైసీపీ నాయకుల పిల్లలు పాఠశాలకు వెళుతున్నారని, టీడీపీ వాళ్లు తమ పిల్లలను అక్కడికి పంపడం మానేశారు. తద్వారా హాజరుశాతం తగ్గిపోయి పాఠశాల మూతపడింది. ఇప్పుడు అందరూ కలిసి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. మండలంలో గతంలో బండిరేవు ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఇదే పరిస్థితి ఉంటే ఎంఈవో విజయ్‌కుమార్ చొరవతో పునఃప్రారంభించారు. ఇక్కడ కూడా ఇదే తరహాలో చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకార సంబరాలు





గుడిపాలలో టపాసులు కాలుస్తున్న నేతలు - నింద్రలో టీడీపీ సంబరాలు - వెదురుకుప్పం మండలం పాతగుంటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

గుడిపాల, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లో అధికారులు, టీడీపీ నాయకులు వీక్షించారు. పార్టీ నేతలు టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని బొమ్మసముద్రం క్రాస్‌లో టీడీపీ ఎస్సీ విభాగం మండల నాయకుడు ధనసింగ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. గుడిపాలలో ఎంఈవో రామ్‌నాయక్, ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయాధికారిణి మాధవి, నాయకులు శంకర్ చౌదరి, మురళీ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, సుధాకర్ యాదవ్, ప్రదీప్, లోకేష్, రెడ్డప్ప, యోగానందం, జయచంద్ర నాయుడు, హరి, చందు, శంకర్, రెడ్డప్ప పాల్గొన్నారు.

తవణంపల్లె : మండలంలోని దిగువ మాఘంలో అమరరాజా వ్యవస్థాపకులు గల్లా రామచంద్రనాయుడు భారీ కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. గ్రామాల్లో కేక్‌లు కట్‌చేసి, టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అధికారులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. నడింపల్లి యువరాజు, వాసుదేవరెడ్డి, జగన్నాథం, నటరాజు, కేజీ కుమార్ పాల్గొన్నారు.

నింద్ర : నింద్రలో కూటమి నాయకులు టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. వెంకటేశ్వరరావు, వెంకటేశులు నాయుడు, రవినాయుడు, కృష్ణయ్య, ధనంజయులునాయుడు, మణిరెడ్డి, చక్రపాణి నాయుడు, రవి, ఆనంద్, భాస్కర్, తంగవేలు, బలరాం రెడ్డి పాల్గొన్నారు.

నగరి : దేశమ్మ ఆలయంలో టీడీపీ నేతలు అమ్మవారికి పూజలు చేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. ఆది దేవత సాలమ్మ ఆలయంలో రామానుజం చలపతి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు పూజలు చేశారు. నాయకులు కృష్ణారెడ్డి, మీరా గుణశేఖర్, రాజశేర్, శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు కార్యక్రమాన్ని తిలకించారు. కూటమి నేతలు స్వీట్స్ పంచుతూ, టపాసులు కాల్చారు. సర్పంచులు డిల్లెయ్య, మార్కొండయ్య, వినోద్ కుమార్, గుణశేఖర్ నాయుడు, శంకరమ్మ, సిద్ధయ్యశెట్టి, శీనయ్య, పట్టాభిరెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మండలంలోని ప్రతి కార్యాలయంలోనూ పండగ వాతావరణం నెలకొంది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయంత్‌కుమార్, ఉప తహసీల్దార్ కోమల సహా ఉద్యోగులు హాజరయ్యారు. మిగతా కార్యాలయాల్లోనూ ఉద్యోగులు వీక్షించారు. మండలంలోని పాతగుంటలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బాణసంచా పేల్చి కేరింతలు కొట్టారు. తిమ్మరాజులు, జ్యోతి, నాగరాజునాయుడు పాల్గొన్నారు.

పాలసముద్రం : టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని మండలంలోని పాలసముద్రం, బలిజకండ్రిగ కూడలి ప్రాంతంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు బుధవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎంపీడీవో, ఎమ్మార్వో, తొమ్మిది సచివాలయాల్లో లైవ్ టెలికాస్టింగ్ నిర్వహించారు. కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి, మామిడి తోరణాలు కట్టారు.

పూతలపట్టు : మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎల్‌ఈడీ టీవీ ద్వారా ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద టీడీపీ నేతలు భారీ ఎల్‌ఈడీని ఏర్పాటు చేసి, బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. నేతలు ప్రతాపనేని చంద్రమౌళి, కార్తికేయ చౌదరి, గుంటూరు మురళి, సంపత్ నాయుడు, చిరంజీవి, ప్రమోద్, దగ్గుపాటి వినోద్, సోము, శేషాద్రినాయుడు, హర్ష, బాబు పాల్గొన్నారు.

ఐరాల : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని ఐరాలలో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేలుస్తూ, డప్పులు వాయిస్తూ నృత్యాలు చేశారు. వారపుసంత ప్రాంతంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బ్యానర్‌కు క్షీరాభిషేకం చేశారు. వీఎస్‌అగ్రహారం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

అన్ని సచివాలయల్లో..

మండలంలోని అన్ని సచివాలయాల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు వీక్షించారు. దానికి తగిన ఏర్పాట్లు అధికారులు చేశారు.

గంగాధరనెల్లూరు : ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో టీవీలు, కంప్యూటర్ల ద్వారా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలు, అధికారులు, సర్పంచ్‌లు, నేతలు పాల్గొన్నారు.

యాదమరి : టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జోడి చింతల వద్ద ర్యాలీ నిర్వహించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కర్పగ వినాయకస్వామి ఆలయంలో టెంకాలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



పాలసముద్రంలో ఎన్టీఆర్‌కు నివాళి



ఐరాలలో చంద్రబాబు, పవన్‌కు క్షీరాభిషేకం



యాదమరి వినాయకస్వామి ఆలయంలో పూజలు



నగరిలో టీడీపీ నేతల సంబరాలు



ఎస్‌ఆర్‌పురంలో..





జీడీ నెల్లూరు, కార్వేటినగరం, పూతలపట్టులో ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకిస్తున్న ఉద్యోగులు, టీడీపీ నేతలు

మోహినీ అవతారంలో ఇంద్రవరదుడు

- కమనీయంగా కల్యాణోత్సవం
- హనుమంత వాహనంపై స్వామివారి విహారం



యాదమరి, జూన్ 12: ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పెళ్లి మండపంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారిని వధూవరులుగా అలంకరించి, వేదమంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. అంతకుముందు మూలస్థానంలో వెలసిన దేవదేవరులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, హనుమంత వాహనంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారి నాచ్చియార్ తిరుక్కోలంలో మోహిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి ద్వార పాలకులు, రాక్షస, అశ్వాలను అలంకరించి, సిద్ధం చేశారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి పురవీధులలో ఊరేగిస్తారు.

అన్నదానం




బీఎస్‌ఆర్ పేటలో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు - బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని బీఎస్‌ఆర్ పేట చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గీర్వాణి చంద్రప్రకాష్ సొంత గ్రామమైన బీఎస్‌ఆర్ పేటలో వారి కుటుంబ సభ్యులు యుగంధర్ ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, నీలకంఠంనాయుడు, దిలీప్, రాము, రఘు, రవి, మనోహర్‌నాయుడు, శ్రీనివాసులు, నయాజ్, ఉస్మాన్, కిరణ్, బీజేపీ నాయకులు చిట్టిబాబు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గల అన్నాక్యాంటీన్‌లో టీడీపీ నేతలు పేదలకు అన్నదానం చేశారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. జనార్దన్ గౌడ్, రాధాకృష్ణమనాయుడు, లోకనాథ నాయుడు, సూరి, హేమచంద్ర నాయుడు, వంశీ, మోహన్ నాయుడు, మాధవనాయుడు, రమణ, రాధిక, దేవయాని పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- ఆర్ అండ్ బీ కార్యాలయానికి విద్యుత్ అలంకరణ చేయని అధికారులు




చిత్తూరు సిటీ, జూన్ 12: చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్ అండ్ బీ కార్యాలయానికి విద్యుద్దీపాలంకరణ చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం కార్యాలయానికి సీరియల్ సెట్లు వేశారు.



చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే థామస్‌తో వెదురుకుప్పం నేతలు